క్లుప్తంగా

ఆర్టీఐ జాతీయ డైరెక్టర్‌గా జ్యోతిప్రకాష్


జ్యోతిప్రకాష్

చిత్తూరు కలెక్టరేట్ : ఆర్టీఐ జాతీయ డైరెక్టర్‌గా చిత్తూరు నగరానికి చెందిన జ్యోతి ప్రకాష్ నియమితులయ్యారు. ఈ మేరకు రైట్ టు ఇన్ఫర్మేషన్ ఏ సొసైటీ 2005 యాక్ట్ (ఆర్టీఐ) ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని జ్యోతిప్రకాష్ పేర్కొన్నారు.

పేరయ్యగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత 104 వాహనంలో 75 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్ఎన్ జీవకళ పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చిత్తూరు కార్పొరేషన్: గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ అధ్యక్షులు మధుబాల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తక ప్రదర్శన, ఉద్యమకారుల స్మరణ, గ్రంథపాలకుల సదస్సు, కవి సమ్మేళనం, సాహితీ సదస్సు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

15న మండల సర్వసభ్య సమావేశం

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 15వ తేదీన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరుకావాలని కోరారు.



దీపావళి సందడి

– మార్కెట్‌లో సందడి – కొనుగోలుదారులతో కిటకిట

చిత్తూరు రూరల్: అమావాస్య చీకట్లను పారదోలి వెలుగులను పంచే పండగ దీపావళి. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. ఈ క్రమంలో చిత్తూరు జిల్లాలో దీపావళి పండుగను ఆది, సోమవారాల్లో ఘనంగా జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమయ్యారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం నరక చతుర్దశి, సోమవారం దీపావళి సంబరాలు జరుపుకోనున్నారు. సోమవారం మధ్యాహ్నం 2.45 గంటల్లోపు లక్ష్మీపూజ, కేదారగౌరీ వ్రతం, నోములు చేసుకోవాలని వేద పండితులు చెబుతున్నారు.

దుకాణాలు కిటకిట

పండగ సందర్భంగా చిత్తూరు నగరంలోని చర్చివీధి, బజారు వీధిలో అమ్మకాలు జోరందుకున్నాయి. నోరు దారాలు, ప్రమిదలు, పూజకు కావాల్సిన సామగ్రి కొనుగోలు కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అలాగే మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన టపాసుల దుకాణాలు కిటకిటలాడాయి. రెండు రోజులుగా టపాసుల కొనుగోలు కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.


నోముదారాలు కొనుగోలు చేస్తున్న మహిళలు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు


నోము దారాలు


టపాసులు కొనుగోలు చేస్తున్న యువకులు

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహించిన పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా శనివారం ఉదయం స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాల, కొలువు నిర్వహించారు. యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేశారు. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తరువాత యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి చేపట్టారు. అదేవిధంగా కుంభప్రోక్షణ, ఆచార్య బహుమానం అందజేశారు. కార్యక్రమంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనంబట్టు ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి 'మౌలానా' కృషి మరువలేనిది

– ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: భారతదేశ మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్‌తో విద్యారంగం అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని శనివారం చిత్తూరు నగరంలోని పాత బస్టాండు ఆవరణలో ముస్లిం మతపెద్దలు, కళాశాలల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో హిందూ–ముస్లింల ఐక్యతకు పాటుపడ్డారని తెలిపారు. స్వాతంత్య్రం వచ్చాక దేశంలో విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్రంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చేరువగా సీబీఎస్ఈ, అంతర్జాతీయ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ప్రతి విద్యార్థి తమ భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. కత్తి, తుపాకుల కన్నా కలం గొప్పదని తెలిపారు. బెంగళూరు, చెన్నై నగరాలకు మాత్రమే పరిమితమైన సాఫ్ట్‌వేర్ కంపెనీలను చిత్తూరు యువత కోసం కొత్తపల్లెమిట్టలో ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. డీవీ స్మార్ట్ కంపెనీని త్వరలోనే ప్రారంభిస్తారని పేర్కొన్నారు. తద్వారా వేలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. అనంతరం దాదాపు రెండు వేల మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ముస్లిం నాయకులు అనూ, కార్పొరేటర్ సయ్యద్, ప్రభుత్వ ఖాజీ కరీముల్లా, పీసీఆర్ ప్రిన్సిపాల్ అబ్దుల్ మజీజ్, మతపెద్దలు ఫిర్దోస్ మౌలానా, ఇలియాజ్ హరజత్, వైఎస్సార్ సీపీ నాయకులు అరగొండ కరీమ్, గని, రషీద్, మస్తాన్, చాపు, షమీ, రియాజ్, అక్రమ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయానందరెడ్డి

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి

బంగారుపాళెం: మండల కేంద్రమైన బంగారుపాళెంలో శనివారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక షాదీ మహల్ స్థలం వద్ద ముస్లిం నాయకులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశ మొదటి విద్యాశాఖామంత్రిగా విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు సర్దార్, జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు హిదాయత్, సేవాదళ్ అధ్యక్షుడు షంషీర్, బషీరుద్దీన్ పాల్గొన్నారు.


బంగారుపాళెం: ఆజాద్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: మండలంలోని కాణిపాకం దళితవాడలో శనివారం రూ.25 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ భవనం, రచ్చబండ నిర్మాణానికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎస్సీ సామాజిక వర్గాన్ని ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుందని ఆరోపించారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, నేతలు గణేష్‌ప్రసాద్‌రెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

వినాయకుని సేవలో పూతలపట్టు ఎమ్మెల్యే


వినాయకుని ఆలయం వద్ద ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, వైఎస్సార్‌సీపీ నేతలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శనివారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, నాయకులు గణేష్ ప్రసాద్ రెడ్డి, రవిచంద్రారెడ్డి, సుధీర్, గోపీనాథ్ పాల్గొన్నారు.





దీపావళి కానుకల పంపిణీ


పాత్రికేయులకు టపాసులు అందజేస్తున్న బుల్లెట్ సురేష్, అప్పు


మునిసిపల్ కార్మికులకు దుస్తులు, టపాసులు అందజేస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్: దీపావళి పండుగ సందర్భంగా శనివారం చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న 700 మందికిపైగా పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి దాదాపు రూ.8 లక్షల విలువైన కానుకలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ శుభ్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులకు దీపావళి రోజున నూతన వస్త్రాలు, టపాసులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. వ్యాపారవేత్త మండీ ప్రభాకర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు ద్వారకనాథ్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు చందు, మధుబాబు, బాబు, కెపి.శ్రీధర్, అన్బు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు విరాళం..

చిత్తూరు నగరంలోని కైలాసపురంలో నిర్మిస్తున్న విద్యుత్ దహన యంత్ర శ్మశానవాటికకు విజయానందరెడ్డి రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఆయన శనివారం ఈ మొత్తాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ అధ్యక్షుడు నరేష్‌రెడ్డికి ఇచ్చారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నాయకులు

పాత్రికేయులకు టపాసుల పంపిణీ

చిత్తూరు కార్పొరేషన్: దీపావళి పండుగ సందర్భంగా చిత్తూరులోని పాత్రికేయులకు రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ కానుకలు అందజేశారు. ఆయన శనివారం తన కార్యాలయంలో తనయుడు అప్పుతో కలిసి పాత్రికేయులకు 60 ఐటమ్స్ టపాసుల గిఫ్ట్‌బాక్స్, షర్ట్, ప్యాంట్ బిట్లు ఇచ్చారు. వార్తల సేకరణలో నిత్యం బిజీగా ఉండే మీడియా మిత్రులు కుటుంబ సభ్యులతో పండుగను ఘనంగా జరుపుకోవాలని బుల్లెట్ సురేష్ ఆకాంక్షించారు. అడగకపోయినా పిలిచిమరీ దీపావళి కానుక ఇవ్వడంపై ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు లోకనాథం, కార్యదర్శి అశోక్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, కార్పొరేటర్ నవీన్, లక్ష్మణస్వామి, రాయల్‌కుట్టి, అలీ, నాయకులు మురళీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల అందజేత

చిత్తూరు కలెక్టరేట్ : దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పన్నీర్ సెల్వం మాట్లాడుతూ దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు షణ్ముగం, ముఖ్య సలహాదారు రామన్న, అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలు


కేశవరెడ్డి పాఠశాలలో వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థినులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పలు పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. న్యూబాలాజీ కాలనీలో ఉన్న కేశవరెడ్డి పాఠశాలలో ప్రిన్సిపాల్ జయంతి విద్యార్థులకు పండుగల విశిష్టతను వివరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. నగరపాలక కమిషనర్ అరుణ, జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువత, పిల్లలు దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా స్వచ్ఛ దీపావళి – శుభ దీపావళిని ఆర్.కే.మోడల్ పాఠశాల విద్యార్థులు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ కాలుష్యానికి కారణమైన, భారీ శబ్దాలు ఇచ్చే టపాసులను కాల్చవద్దన్నారు. విజయం సీబీఎస్ఈ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ తేజోమూర్తి మాట్లాడుతూ దీపం ఉన్న చోట జ్ఞానసంపద ఉంటుందన్నారు. తెల్లనికాంతిని పరమశివునికి ప్రతినిధిగా భావించి దీపావళి పండుగను జరుపుకుంటారని విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల డైరెక్టర్ శైలజ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.రెండు లక్షల విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి దాతలు శనివారం రూ.రెండు లక్షల విరాళం ఇచ్చారు. తవణంపల్లె మండలం కాణిపాకపట్నంకు చెందిన రాజశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఉదయం స్వామి వారి దర్శనానికి వచ్చారు. వారు అన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని అధికారులకు అందజేశారు. అలాగే కర్ణాటకకు చెందిన కునాల్ గౌడ్ కుటుంబ సభ్యులు అన్నదానానికి రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాతలకు అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి వేదపండితులతో ఆశీర్వచనం ఇప్పించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న దాతలు

